విలేఖర్లు కావలెను

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్ సి ఇన్ఛార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను.

సంప్రదించ వలసిన నెంబర్:
7095999737,9908103501

PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:05 ఎడిటర్: రాపోలు లింగస్వామి 05 -09 -2026 శనివారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## ఆ నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దు



కొడంగల్,: తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించి,పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మద్దూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మాణంలోని సాంఘిక సంక్షేమ గురుకులం పనులను పరిశీలించారు.అలాగే,దౌల్తాబాద్ మండలం గోకఫసల్వాద్‌లో నిర్మాణంలో ఉన్న..సాంఘిక సంక్షేమ గురుకులం పనులను పరిశీలించారు.దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పనులను పరిశీలించనున్నారు.నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దని అన్నారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించిన అనంతరం.. నియోజకవర్గ అభివృద్ధి పనులపైన విూక్షించనున్నారు. రోడ్డుమార్గాన కొడంగల్ చేరుకొని అక్కడే బస చేయనున్నారు. శనివారం కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష చేయనున్నారు.

## కాంగ్రెస్ పార్టీ కోసం సీపీ సజ్జనార్ లాలూచీ పనులు..

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కాంగ్రెస్ పార్టీకోసం పనిచేస్తున్నాడు అంటూ ఎమాజీ మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి పొలిటికల్ డ్యామేజ్ కావొద్దని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ లాలూచీ పనులు చేశాడని తీవ్రమైన ఆరోపణలు చేశారు. తన పీఏ సుమంత్ కేసులో అసలైన నిందితుడే సుమంత్ మీద రివర్స్ కేసు పెట్టాడన్నారు.ఆధారాలతో సహా నిందితుడిని పట్టించి, మీడియా ముందు ప్రవేశపెడతానని సుమంత్ చెప్పాడు. అలా చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని సజ్జనార్ ప్రెస్ మీట్ పెట్టనివ్వలేని పేర్కొన్నారు. సజ్జనార్ ఆదేశాలతో నిందితుడిని వదిలేశాక, 15 రోజులకు అతను వచ్చి సుమంత్ మీద కేసు పెట్టాడని ఆమె తెలిపారు.



## కేఆర్ఎంబి భేటీలో తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై కుదరని ఏకాభిప్రాయం

హైదరాబాద్,: కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం శుక్రవారం జరిగిం ది.ఈ సమావేశంలో పలు కీలక అం శాలపై చర్చించామని తెలంగాణ ఈఎ న్సీ రమేశ్ బాబు పేర్కొన్నారు. అయితే, నీటి పంపకాలపై ఏకాభిప్రాయం కుదరలేదని తెలిపారు. సెప్టెంబర్ నాలుగో వారంలో మరోసారి భేటీ కావాలని నిర్ణయించామని వెల్లడించారు. తాగునీటిపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు.ఎల్‌నినో ప్రభావంతో 50:50 వాటా కావాలని కోరామని ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 66:34 వాటా లెక్కన పంపిణీ చేయాలని డిమాండ్ చేసిందని అన్నారు. ఏపీ డిమాండ్‌ను తెలంగాణ వ్యతిరేకించిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకుపోతోందని తెలిపారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు – ఏపీ 100 టీఎంసీలను అడిగిందని చెప్పారు. ప్రస్తుతం కేఆర్ఎంబీ పరిధిలో 142 టీఎంసీలు ఉన్నాయని ఈఎన్సీ రమేశ్ బాబు పేర్కొన్నారు.




## లాక్రోస్ క్రీడాకారిణులకు మంత్రి పొన్నం అభినందన.

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 04(జ్యోతి ప్రభంజనం): అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటి కాంస్య పతకం సాధించిన



జాతీయ లాక్రోస్ జట్టు సభ్యులు చిర్రబోయిన సంగీత, గోపికలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం హైదరాబాద్‌లో అభినందించి సత్కరించారు. గత నెల కౌలాలంపూర్‌లో జరిగిన సౌత్‌ఈస్ట్ ఆసియా లాక్రోస్ చాంపియన్‌షిప్?2026 పోటీల్లో భారత జట్టు కాంస్య పతకం సాధించగా, జట్టులో తెలంగాణ బీసీ గురుకుల విద్యార్థినులు సంగీత, గోపికలు సభ్యులుగా ఉన్నారు.చిట్యాల మున్సిపాలిటీకి చెందిన చిర్రబోయిన సంగీత, నల్లగొండకు చెందిన గోపిక మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించి సత్కరించారు. బీసీ గురుకుల సొసైటీ తరఫున ఒక్కొక్కరికి రూ.1.76 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 వేల చొప్పున నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. జాతీయ జట్టు క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ, సహకారాలను భవిష్యత్తులోనూ అందిస్తామని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగుల సైదులు, ఫిజికల్ డైరెక్టర్లు అంజలి, మమత, శోభ, కోచ్‌లు శివకుమార్, ఆకాశ్, తెలంగాణ లాక్రోస్ అసోసియేషన్ అధ్యక్షుడు లతీఫుద్దీన్, జనరల్ సెక్రటరీ భానుచందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో ఎక్కడా వర్గ పోరు లేదు

మంచిర్యాల, సెప్టెంబర్ 4,: కాంగ్రెస్‌లో ఎక్కడా వర్గ పోరు లేదని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. నేతలు అందరం కాంగ్రెస్ బలోపేతం కోసమే పని చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన



మీడియాతో మాట్లాడారు. వేయి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేసిందని తెలిపారు.

**ఆ జీవోను పున:పరిశీలన చేస్తున్నాం..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేక పోయిన తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. 22ఏ భూముల సమస్య గత బీఆర్ఎస్ ప్రభుత్వ పుణ్యమేనని, ఆ జీవోను పున:పరిశీలన చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే పరిష్కరిస్తామని మాటిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగిందో ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ఎందుకు కుగిందనే విషయంపై హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు.

## సిఎంకు ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయాల్సిన అవసరం లేదు

ఢిల్లీ: కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం అని..టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కేబినెట్ విస్తరణ ఇప్పుడు అంశమే కాదని అన్నారు. కొండా సురేఖ ఎపిసోడ్ పై మహేష్ గౌడ్ స్పందిస్తూ..ఆయన మీడియాతో మాట్లాడుతూ..మాట్లాడేందుకు పార్టీలోనే ఎన్నో వేదికలు ఉన్నాయని, క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు.కూతురు చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఎప్పుడో ఖండించి ఉండాల్సిందని, ఖండించకపోవడం వల్లే ఎఐసిసి తీవ్రంగా పరిగణించిందని తెలియజేశారు. భవిష్యత్తులో బిసిలకు పెద్దపీట వేసే ఆలోచన హైకమాండ్ కు



ఉందని, నివేదిక ఆధారంగానే హైకమాండ్ యాక్షన్ తీసుకుందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలలో జరగాల్సిన చర్చలే ఇప్పుడు కీలకమని, సిఎం రేవంత్ రెడ్డికు ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయాల్సిన అవసరం లేదని అన్నారు. బహిరంగంగా మాట్లాడటం క్షమించరాని తప్పు అని సూచించారు. పార్టీలో కొండ సురేఖ కొనసాగాలని తాము కోరుకుంటున్నాం మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## రాష్ట్ర రైతులకు సాగునీళ్లు, కరెంట్ ఇవ్వడం లేదు

హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పరిపాలనలో మహిళా మంత్రిని బర్తరఫ్ చేశారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ ఆందోళనలు చేస్తుందని,బిఆర్ఎస్ నిరసన కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పా ల్గొంటున్నారని అన్నారు. ఈ సం దర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టి బెదిరిస్తున్నారని విమర్శించారు. ధరణి పేరుతోఒక్కరు కూడా పైరవీలు చేయలేదని,కానీ ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పైరవీ కారు లు ఉన్నారని తెలియజేశారు. కాం గ్రెస్ ప్రభుత్వం ఎపిసిఎం చంద్ర బాబునాయుడు కోసం పనిచే స్తుందని,ఎపికి సాగునీళ్లు వదిలిపెడుతున్నారనిజగదీష్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర రైతులకు సాగునీళ్లు, కరెంట్ ఇవ్వడం లేదని, ఆరోపణలు ఎదుర్కొంటున్నా మంత్రులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. నదీ జలాల్లో మన వాటాను కాపాడాలని, కన్నెపల్లి పంప్ హౌస్ లో మోటార్లు ఆన్ చేయాలని కోరారు. కొండా సురేఖ బర్తరఫ్‌తో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతి బయటపడిందని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.




## తెలంగాణలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..

హైదరాబాద్, సెప్టెంబర్ 4: రాష్ట్ర వ్యాప్తంగా కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇస్కాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆలయాలను పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వేణుగోపాలుడి ఆలయాలకు భక్తులు క్యూకట్టారు. ఆ మాధవుడి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉట్టికొట్టి సంబరాలు చేసుకుంటున్నారు.శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్ భక్తులతో కిటకిటలాడుతోంది. దర్శనం కోసం నగరం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల కోసం ప్రత్యేక దర్శనం, క్యూలైన్‌ను ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భజనలు, కీర్తనలతో ఇస్కాన్ ఆలయం మార్మోగుతోంది.



## సంపాదకీయం

# హిందువుల ఐక్యతే వీహెచ్‌పీ లక్ష్యం

హిందూ సమాజాన్ని సంఘటితం చేసి, సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలనే మహోన్నత సంకల్పంతో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆవిర్భవించింది. శ్రీకృష్ణ జన్మాష్టమి పవిత్ర పర్వదినంతో ముడిపడి ఉన్న విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం ప్రతి హిందువులోనూ ధర్మచైతన్యాన్ని మేల్కొలిపే సందర్భం. ధర్మం కోసం నిలబడటం, సమాజాన్ని సంఘటితం చేయడం, బలహీనులకు అండగా నిలవడం, సత్యాన్ని కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అనే స్ఫూర్తిని ఈ ఆవిర్భావ దినోత్సవం మనకు గుర్తుచేస్తున్నది. 1964లో ముంబైలో సాధుసంతులు, ధార్మిక పెద్దలు, సామాజిక నాయకులు కలిసి విశ్వహిందూ పరిషత్‌కు పురుడుపోశారు. భిన్నమైన మతాలు, పీఠాలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, సాధుసంతులను ఒకే వేదికపైకి తీసుకురావడం వెనుక ఉన్న ఆలోచన అత్యంత విశాలమైనది. దేశంలోని హిందువులందరినీ ఒకే సంప్రదాయంలోకి తీసుకురావడం కాదు.. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ 'మనమంతా హిందూ సమాజానికి చెందినవారమే' అనే ఆత్మీయ భావనను బలపరచడం విశ్వహిందూ పరిషత్ ప్రధాన లక్ష్యం. సాధుసంతుల మార్గదర్శకత్వం, సమాజంలోని వివిధ వర్గాల సహకారం, కార్యకర్తల అంకితభావంతో వీహెచ్‌పీ తన ప్రస్థానాన్ని విస్తరించుకుంటూ వస్తోంది. హిందూ సమాజ చైతన్య ప్రస్థానంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమం ముఖ్యమైన ఘట్టం. శ్రీరామ జన్మభూమిలో భవ్యమైన శ్రీరామ మందిరం నిర్మించాలనే ఆకాంక్షను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశ్వహిందూ పరిషత్ ప్రముఖపాత్ర పోషించింది. దీర్ఘకాలిక న్యాయ, సామాజిక, ప్రజా ప్రక్రియల అనంతరం అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం సాకారం కావడం కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. విశ్వహిందూ పరిషత్ దశాబ్దాలుగా సేవ, సంస్కారం, సమరసత, ధర్మజాగరణ, గోరక్షణ, దేవాలయ పరిరక్షణ, సామాజిక చైతన్యం వంటి అనేక రంగాల్లో పనిచేస్తోంది. సమాజంలో అవసరమైన వర్గాలకు విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు అందించడం, గిరిజన మారుమూల ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వీహెచ్‌పీ ప్రధాన బాధ్యత. విపత్తుల సమయంలో బాధితులకు సహాయం చేయడం వంటి కార్యక్రమాల ద్వారా పరిషత్ సేవా భావాన్ని ముందుకు తీసుకెళ్తోంది. హిందూ సమాజంలో ఏ వర్గం వెనుకబడినా అది మొత్తం సమాజం వెనుకబడినట్లేననే భావనతో సామాజిక సమరసతకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. కుల, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి హిందువూ పరస్పరం సోదరభావంతో మెలగాలి. ఇదే సనాతన ధర్మం మనకు నేర్పే మానవీయ విలువ. నేడు హిందువులు ప్రపంచంలోని అనేక దేశాల్లో నివసిస్తున్నారు. విదేశాల్లో జన్మించిన హిందూ యువతరానికి భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు, పండుగలు, సంప్రదాయాలు, దేవాలయాలు, ధార్మిక వారసత్వం గురించి అవగాహన కల్పించడం ఒక ముఖ్యమైన బాధ్యత. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజాన్ని అనుసంధానించే వేదికగా విశ్వహిందూ పరిషత్ పాత్ర మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటోంది. 'ప్రపంచంలో ఎక్కడ హిందువు ఉన్నా.. అతని సాంస్కృతిక మూలాలు భారతీయ సనాతన సంప్రదాయంతో అనుసంధానమై ఉండాలి' అనే భావనను బలపరచడం అవసరం. భారత భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, చరిత్ర, కుటుంబ విలువలు, దేశభక్తి, సేవాభావం, ధర్మబద్ధమైన జీవన విధానం గురించి కూడా యువత తెలుసుకోవాలి. ధర్మం అంటే కేవలం దేవాలయానికి వెళ్లడం లేదా పూజలు చేయడం మాత్రమే కాదు. ధర్మం అంటే సత్యం, న్యాయం, కర్తవ్యం, సేవ, త్యాగం, పరస్పర గౌరవం, సమాజం పట్ల బాధ్యత. ఈ విశాలమైన ధర్మ భావనను యువతలో పెంపొందించడమే నేటి అవసరం. హిందూ సమాజంలోని ప్రతి కుటుంబం ధర్మం పట్ల అవగాహన కలిగి ఉండాలి. ప్రతి గ్రామంలో ధర్మచైతన్యం పెరగాలి. ప్రతి యువకుడిలో సేవాభావం పెంపొందాలి. ప్రతి కుటుంబంలో సంస్కారం బలపడాలి. ప్రతి హిందువు మరో హిందువును తన సోదరుడిగా భావించే పరిస్థితి ఏర్పడాలి. శ్రీకృష్ణుడు గీతలో చేసిన కర్తవ్యబోధనే మనకు మార్గదర్శకం. ధర్మం కోసం పనిచేసే ప్రతి వ్యక్తి, సమాజ సేవలో పాల్గొనే ప్రతి కార్యకర్త, సంస్కృతి పరిరక్షణకు కృషి చేసే ప్రతి కుటుంబం... హిందూ సమాజ భవిష్యత్తుకు ఒక బలమైన పునాది. ఈ పవిత్ర శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా, విశ్వహిందూ పరిషత్ 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని "హిందవః సోదరాః సర్వే" (హిందువులందరూ సోదరులే) అనే భావంతో హిందూ సమాజం మరింత సంఘటితం కావాలని, సనాతన ధర్మం శాశ్వత విలువలను ప్రపంచానికి మరింత బలంగా చాటాలని మనమందరం సంకల్పిద్దాం.

# ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి

జ్యోతి ప్రభంజనం, మోత్కూర్, సెప్టెంబర్ 05:సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి శుక్రవారం మోత్కూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభలు ఈనెల 8 9 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరుగుతున్న మహాసభల సందర్భంగా మోత్కూర్లో ప్రచార జాతాను యానాల దామోదర్ రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు సంవత్సరానికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తానని నేటికీ 13 సంవత్సరాలు కావస్తున్న లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, కనీసం రిటైర్మెంట్ అయిన స్థానాలలో కూడా ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వకుండా మాట దాటవేస్తున్నారని యువతను నిర్వీర్యం చేస్తున్నారని నిరుద్యోగులు ఉద్యోగాలు లేక రోడ్ల వెంట తిరుగుతున్నారని ఉపాధి కోసం కార్పొరేషన్ల ద్వారా అవకాశాలు కల్పించాలని విద్యా వైద్యం ఉపాధి హక్కుల కోసం పోరాడాలని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తూ యువత సంగటితమైతే సమాజం మారుతుందని వారు తెలుపుతూ ఈ నెల ఎనిమిదవ తేదీ నాడు యాదగిరిగుట్టలో జరుగు యువజన భారీ బహిరంగ సభను పార్టీలకతీతంగా యువజన సంఘాలు పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో




ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుల్ల శేఖర్ రెడ్డి మోత్కూరు మండలం ఏఐవైఎఫ్ అధ్యక్షుడు చిప్పలపల్లి ప్రశాంత్ ఎడ్ల ఆనంద్ జంగలింగం సిపిఐ మోత్కూర్ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ మండల సహాయ కార్యదర్శి పుల్కరం మల్లేస్ ప్రజానాట్యం మండలిజిల్లా అధ్యక్షుడు బుష్పక నరసింహడిహెచ్పీఎస్ జిల్లా కార్యదర్శి జిట రాములుఏఐటియుసి మండల కార్యదర్శి తొంట తిరుపతి. పెండెం వెంకటేశ్వర్లుగొలుసులు యాదగిరికడమంచి వీరస్వామితాడూరు లక్ష్మీ నరసయ్య, గంగాదేవి చంద్రయ్య. తదితరులు పాల్గొన్నారు

# తిట్ల దండకం తప్ప.. ప్రజా పాలన ఏది..?

**– రియల్ ఎస్టేట్ దందాకే పరిమితమైన కాంగ్రెస్ పరిపాలన**
**– హామీలు గుప్పించారు అమలు చేయడంలో తూట్లు పొడిచారు**
**– వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం**
**– రేవంత్ సర్కార్ పై విరుచుకుపడ్డ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**
**– భద్రాద్రి కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్ష వంటావార్పు**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడిందని సీఎం రేవంత్ రెడ్డిది తిట్ల దండకం తప్ప ప్రజా పాలన ఏది..? అంటూ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ దందాకే కాంగ్రెస్ పరిపాలన పరిమితమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలపై శుక్రవారం జిల్లా కలెక్టరేట్ పక్కనున్న ధర్నా చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్షతో పాటుగా వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కాదని ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించలేదన్నారు. వ్యవసాయ విద్యుత్ సాగునీరు యూరియా రైతు బీమా తదితర అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. మహిళలకు నెలకు రూ. 2,500, కళ్యాణలక్ష్మి, పేదల వివాహాలకు తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు వంటి హామీలను అమలు చేయలేదని వీటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ వంటి అంశాలపై యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. వృద్ధులు వికలాంగులు మహిళలు రైతులు విద్యార్థులు యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే బీఆర్ఎస్ పార్టీ ఈ నిరసన కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మహిళలకు తీవ్ర అన్యాయం...కాంగ్రెస్ పాలనలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఇచ్చిన హామీలు అమలు కాక ఫీజుల బకాయిలు అందక ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో ఎలాగైనా ఓట్లు దండుకోవాలనే కుయుక్తులతో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితర కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్టుగా హామీలిచ్చారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన 420హామీలు,6 గ్యారంటీలలో ఏఒక్కటి కూడా అమలు పర్చకుండా మహిళల సంక్షేమాన్ని విస్మరించారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పిలుపు మేరకు కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ఎండగడుతూ తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 అందజేస్తామని వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళల పింఛన్లను 2వేల నుంచి 4వేల రూపాయలకు పెంచుతామని కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు స్కూటీలు బహూకరిస్తామని హామీలిచ్చి అమలు చేయడం లేదన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రూ. 1,00,116 చొప్పున ఉచితంగా అందజేసిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం అందజేస్తామన్న కాంగ్రెస్ నాయకుల వాగ్దానం నీటి మూటగానే మారిందని ఎంపీ వద్దిరాజు మండిపడ్డారు. కేబినెట్ లో ఉన్న బీసీ మంత్రిని రేవంత్ రెడ్డి తొలగించారని బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచి సంక్షేమానికి ఏటా 20వేల కోట్లు ఖర్చు చేస్తామన్న హామీ ఒట్టిదేనని తేలిపోయిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాతా శిశు సంక్షేమానికి "కేసీఆర్ కిట్" పేరిట తాతగా మేనమామగా అన్నగా 13వేల నగదుతో పాటు 20 రకాల అవసరమైన వస్తువులు ఉచితంగా అందజేసిన విషయాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. ఫీజు బకాయిలు విడుదలలో నిర్లక్ష్యం..విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ మంజూరు చేయకపోవడంతో వాళ్లు చదువుకోలేకపోతున్నారని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. శిరీషా అనే గిరిజన ఆదివాసీ బిడ్డ అత్యాచారానికి గురై చంపబడితే ఆ కుటుంబాన్ని ఈ ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. ఆ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టించి ఇవ్వాలని ఆమె అన్న శివరాంకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఎంపీ రవిచంద్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులకు పాలించడం చేతకావడం లేదని ప్రభుత్వ భూములను అమ్ముకోవడం దోచుకోవడం దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి, మంత్రులు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారే తప్ప మహిళల సంక్షేమానికి అభ్యున్నతికి అక్కడ నుంచి ఒక్క రూపాయి కూడా తెలంగాణకు తేలేకపోతున్నారని ఎంపీ వద్దిరాజు నిశితంగా దుయ్యబట్టారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత గురించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శనంలో పార్లమెంటులో మాట్లాడి అవసరమైన



మొత్తాన్ని సాధించడం జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడిన ఇతర రాష్ట్రాల ఎంపీలను అడ్డుకోవడంలో 8మంది కాంగ్రెస్ లోకసభ సభ్యులు ఎంఐఎం అసదుద్దీన్ ఓవైసీ విఫలమైన సందర్భాన్ని రవిచంద్ర ప్రస్తావించారు. ఇక్కడ నిషేధిత జాబితాలో పెట్టిన 444, 666, 817, 999, 727 సర్వే నంబర్లలోని భూములకు అందులో నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు తిరిగి బీఆర్ఎస్ ను గెలిపించేందుకు కేసీఆర్ ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సంసిద్ధులై ఉన్నారని ఎంపీ వద్దిరాజు వివరించారు. ఈ వంటావార్పు కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్గానిక్ శ్రీకృష్ణ మందిరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు.

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 04(జ్యోతి ప్రభంజనం):చిట్యాల



మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామంలోని ఆర్గానిక్ శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిరం ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు చిన్నారులు గోపికల వేషధారణలో హాజరై శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, ఉట్టి కొట్టే కార్యక్రమంతో మందిరం ఆవరణలో పండుగ సందడి నెలకొంది. కార్యక్రమంలో శ్రీకృష్ణ మందిరం వ్యవస్థాపకుడు పానుగుళ్ల వెంకటేశ్వర్లు, ఎం. రాజేంద్రకుమార్, హరికుమార్‌రెడ్డి, రఘుబాబు, లింగారెడ్డి, సందీప్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుండె చప్పుళ్ళు

మనిషి అస్తిత్వానికి తొలి సాక్ష్యం గుండె చప్పుడు,
మరణ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ సాగే జీవన ప్రకటన.



దానికి విశ్రాంతి లేదు, విరామం లేదు,
కాలగర్భంలో క్షణక్షణం కర్తవ్యాన్ని చెక్కే కర్మయోగి అది.
శరీరం శిథిలమైనా స్పందనను శాసించే శక్తి అది,
రక్తనాళాల చీకటి మార్గాల్లో వెలుగును మోసే రథసారథి.
మనిషి తన ఉనికిని మరచిపోయినా,
అంతరంగపు అగాధంలో అది మనల్ని మనకు పరిచయం చేస్తుంది.
ప్రతి చప్పుడు కాలానికి వేసిన ఒక సంతకం,
ప్రతి స్పందన మరణానికి విసిరిన ఒక సవాలు.
నిశ్శబ్దంగా కొట్టుకుంటూనశ్వరత్వంపై నిత్యత్వపు భ్రమను నిర్మిస్తుంది.
సంతోషం దానిని ఉప్పొంగించే అల,
వేదన దానిని లోపలినుంచి కొరికే విషపు దంతం.
ప్రేమ దానిలో ప్రళయాన్ని రేపుతుంది,
విరహం దాని గర్భంలో శూన్యాన్ని నాటుతుంది.
ఆశకు అది అగ్నికణం,
నిరాశకు అది ఆరిపోని బూడిద.
బాధ్యతల బండరాళ్ల కింద నలిగినా,
బ్రతుకుపై తన తిరుగుబాటును ఆపదు.
కాలం శరీరంపై వృద్ధాప్యాన్ని చెక్కుతున్నా,
గుండె మాత్రం ప్రతి చప్పుడుతో యవ్వనాన్ని ప్రకటిస్తుంది.
చివరి స్పందన దాకాప్రాణం అనే యుద్ధభూమిలో ఒంటరి యోధుడిలా నిలుస్తుంది.
ఒక రోజు ఆ చప్పుడు ఆగిపోతుంది,
శ్వాస తన చివరి వాక్యాన్ని ముగిస్తుంది.
అప్పుడు మిగిలేది శరీరం కాదు జ్ఞాపకం,
గుండె చప్పుడు కాదు మనం జీవించినదానికి మిగిలిన ప్రతిధ్వని.

రచన : కె.మురళీమోహన్ రాజు,
నెల్లూరు.చరవాణి : 9866179385

# గత ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం ముప్పు

**– విలేఖరుల సమావేశంలో మంత్రి పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): గతంలో పదేళ్ళు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే.. మనకు పోలవరం ముప్పు పొంచి ఉందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భద్రాచలంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవస్థాన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు మండలాలను, భద్రాచలం చుట్టుపక్కల ఐదు గ్రామపంచాయతీలను ఆంధ్రాలో విలీనం చేయడం బాధాకరమని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుతం వరదలు లేకున్నా భవిష్యత్ లో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణం కంటే 20-25 అడుగుల వరకు అధికంగా బ్యాక్ వాటర్ ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గతంలో సిడబ్ల్యూసి, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. పోలవరానికి తాము వ్యతిరేకం కాదని తెలంగాణలో ముంపు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పార్లమెంట్ సమావేశాల నాటికి తెలంగాణ ఎంపీలు, గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి



ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి పోలవరం ప్రభావంతో జరిగే వరద ముప్పు తీవ్రతను వివరించి పునః పరిశీలించాలని కోరతామని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు.

# భద్రాచలం దేవాలయం అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

**– పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి**
**– ముక్కోటి ఉత్సవాలలోపు ఉత్తర ద్వారా పనులు పూర్తి చేయాల్సిందే**
**– రెవెన్యూ సమాచారం శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**– స్వామి వారి ఆలయం దర్శించుకున్న మంత్రి**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):గోదావరి పుష్కరాల ప్రారంభం నాటికి అభివృద్ధి నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చూడాలని రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రాద్రి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పున నిర్మాణాలను చిత్రకూట మండపం పరిసరాలను గోశాల ప్రాంతాన్నీ అన్నదాన సత్రం విస్తా కాంప్లెక్స్ శివాలయానికి వెళ్లే మార్గం ఉత్తర ద్వార దర్శనం రామాలయంలో జరుగుతున్న పలు పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాంట్రాక్టర్స్ ను, ఆర్కిటెక్చర్లను సకాలంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలో జరిగే ముక్కోటి ఉత్సవాలలోపు ఉత్తర ద్వారా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వచ్చే ఏడాది ఏప్రిల్ లో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలలోపు అన్ని పనులు పూర్తయ్యాలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి సూచించారు. అదేవిధంగా వచ్చే ఏడాది 2027 జూన్ – జులై నెలలో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి ఘాట్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూ. 276 కోట్ల నిధులు ఆలయ పరిసరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎటువంటి నాణ్యతా లోపాలు లేకుండా దశాబ్దాల కాలం పాటు నిర్మాణాలు ప్రతిష్టంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. దక్షిణాయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రం ఆలయ అభివృద్ధికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలలో పాల్గొని ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి వెంట జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణలతో పాటు భద్రాచలం ఐటీడీఏ పీ.ఓ రాహుల్, ఆలయ ఈఓ దామోదర్, తహసీల్దార్ రవి కుమార్, వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బృంగి ఆస్పత్రిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**
**ప్రజలు, రోగులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష**




ఎల్ బి నగర్, (జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 04:శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శ్రీపురం కాలనీలోని బృంగి ఆస్పత్రిలో వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యదర్శి పోతుగంటి భారత్ ప్రసాద్‌తో పాటు బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, సిబ్బందితో కలిసి మొద్దు లచ్చిరెడ్డి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుడి ఆశీస్సులతో సమాజంలో శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇళ్లకు చేరాలని కోరుకున్నారు. కాలనీ వాసులు, వైద్యులు, సిబ్బందికి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బృంగి ఆస్పత్రి చైర్మన్ బృంగి శిరీష్‌కుమార్, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శ్రీపురం కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విటల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు కాలనీ ప్రతినిధులు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# అవసరాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి జరగాలి

**– రోజుకు 1.90 లక్షల టన్నుల నల్ల బంగారాన్ని ఉత్పత్తి చేయాలి**
**– సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన సరఫరా ఒప్పందం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయడానికి సింగరేణిలో రోజుకు 1.9 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. సింగరేణి భవన్ నుంచి ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో శుక్రవారం బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, అలాగే రాష్ట్ర ఇంధన శాఖ వారు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందించాలంటూ సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారని దేశ ఇంధన భద్రత రీత్యా తగినంత బొగ్గును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థల పైన ఉంది కాబట్టి సింగరేణి కూడా శక్తి వంచన లేకుండా కృషిచేసి బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన ఏరియాల వారీగా ఇప్పటివరకు ఇవ్వబడిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఆగస్టు 31వ తేదీ నాటికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల కాలం పూర్తి కాగా సింగరేణి సంస్థ 253 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిందని, దీనిలో 90 శాతం పైగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందని అధికారులు వివరించారు. కాగా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సంస్థ సీఎండీ స్పష్టం చేశారు. నైనీ బొగ్గు గని నుండి సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మొదటి రైల్వే రేకుతో బొగ్గు సరఫరా చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంపై దామరచర్ల లోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మరొక రేకు ఇటీవల సరఫరా చేశామని ఇకముందు కూడా రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నైనీ బ్లాక్ నుండి బొగ్గును రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయటం జరుగుతుందని ఆయన వివరించారు. బొగ్గు ఉత్పత్తి రవాణాతోపాటు ఓవర్ బర్డెన్ తొలగింపుపై కూడా ఛైర్మన్ సమీక్షించారు. ఆగస్టు నెలాఖరి వరకు ఆఫ్ లోడింగ్ ద్వారా 1,315 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించడం జరిగిందని




అయితే ఇచ్చిన లక్ష్యాలలో ఇది 95 శాతం మాత్రమే కనుక నూరు శాతం పైబడి ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఆఫ్ లోడింగ్ ఏజెన్సీ లను సమాయత్తం చేయాలని ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన ఈ సమయం ఉత్పత్తికి అనుకూలంగా ఉంది కనుక రోజువారీ లక్ష్యాలను దాటి బొగ్గు ఉత్పత్తి సాధించాలని రైల్వే విభాగం వారితో సమన్వయం జరుపుతూ నూరు శాతం పైబడి బొగ్గు రవాణా సాధించాలన్నారు. రక్షణా ప్రమాణాలు పాటిస్తూ తగిన నాణ్యత గల బొగ్గును సరఫరా చేయడానికి పై అధికారుల నుండి కింది వరకు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్. వి సూర్యనారాయణ, డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం)ఎమ్.తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ మార్కెటింగ్)టి.శ్రీనివాస్, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి**
**ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. ఉట్టి కొట్టే కార్యక్రమాలతో కోలాహలం**

రంగారెడ్డి జిల్లా (జ్యోతి ప్రభంజనం), సెప్టెంబర్ 04:రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా వాడవాడలా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులను కన్నయ్య, రాధ వేషధారణల్లో





అందంగా అలంకరించిన తల్లిదండ్రులు వారితో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, కృష్ణుడి లీలలను ప్రతిబింబించే అలంకరణలు ఆకట్టుకున్నాయి. దీంతో





పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. పలు ఆలయాల్లో కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉట్టి పందిళ్ల వద్ద యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో సందడి నెలకొంది. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తులకు



ప్రసాద వితరణ చేపట్టారు. చిన్నారుల కృష్ణవేషధారణలు, భక్తుల సందడితో జిల్లా వ్యాప్తంగా పండుగ శోభ సంతరించుకుంది.

# ఘనంగా రాపోలు అశ్విత శ్రీ జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి శుభకాంక్షలు తెలిపిన తల్లిదండ్రులు లక్ష్మణ్ మమత**



జ్యోతి ప్రభజనం, నెక్కొండ, సెప్టెంబర్ 05:నెక్కొండ మండలం అప్పలరావుపేట గ్రామానికి చెందిన రాపోలు అశ్విత శ్రీ జన్మదిన వేడుకలు గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రాపోలు లక్ష్మణ్ మమత తమ కూతురుకి అక్షంతలు వేసి కేకుకట్ చేసి తినిపించి దేవాతి దేవుళ్ల కటాక్షం కలిగి ఉండాలని ఆయురారోగ్యాలతో, విద్యాబుద్ధులతో వర్ధిల్లాలని దీవించి కూతురికి శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపోలు అశ్విత్ వరన్, సోల్తి నాగరాజు, రాపోలు మంజుల, చలుకలపల్లి కనకతార, ముత్తినేని పద్మ, ఎదర బోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూరు యూత్ కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా అవిశెట్టి మధు నియామకం



జ్యోతి ప్రభంజనం (మోత్కూర్) మోత్కూరు పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో శుక్రవారం రోజునమోత్కూర్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరసానిపల్లి సందీప్ మరియు యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అవిశెట్టి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మోత్కూర్ యూత్ కాంగ్రెస్టౌన్ అధ్యక్షుడిగా అవిశెట్టి మధుకి నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అవిశెట్టి మధు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ కోసం తనవంతు కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి మోత్కూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్ మెంట రమణ నాగేషకురుమిళ్ళ ప్రమీల రాములు మార్కెట్ డైరెక్టర్ ఎండీ సమిరుద్దీన్ మండల ప్రధాన కార్యదర్శి బుషిపాక రమేష్ మండల నాయకులు తండ సత్తయ్య,దుర్గయ్యఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు నిమ్మల శ్రీను యూత్ కాంగ్రెస్ నాయకులు ఆలకుంట్ల శ్రీనుబిను రాహుల్ బుషిపాక నరేష్ బోల్లపెల్లి శ్రావణ్ఎడ్ల రఘుసాయిఅన్నెపు గోపికొలిపాక ఉపేందర్అన్నెపు సురేషబుర్ర శ్యాంప్రసాద్ దోడ వెంకటేష్ఉదయుతొట్ల వెంకటేష దోరవల్లి బుగ్గ రాములు కోళ్ల శివమచ్చగిరిరమేష్అవిశెట్టి అఖిల్ పూనల కార్తీక్ నూనెమెంతులా సాయి హర్షిత్ టంగుటూరి అజయుత దితరులు పాల్గొన్నారు.

# కొండా సురేఖ భర్తరఫ్ చేయడం బీసీలను అవమాన పర్చడమే.



జ్యోతి ప్రభంజనం ( మోత్కూర్ )బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పద్మశాలి ముద్దుబిడ్డ కొండా సురేఖను రాజకీయంగా ఎదగనివ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేశారని బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య ఆరోపించారు. శుక్రవారం రోజునమోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ గత 3 దశాబ్దాలపైగా ఎంపీటీసీ నుంచి ఎమ్మెల్యే, మంత్రి దాకా అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు చట్టసభలలో సముచిత స్థానం కల్పిస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావోస్తున్న రిజర్వేషన్ కల్పించపోవడంతో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి సురేఖను రాష్ట్ర క్యాబినెట్ నుంచి అక్రమంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సురేఖ భర్తరఫ్ చేయడం చూస్తుంటే ఇది బీసీ సామాజిక వర్గాన్ని అవమాన పర్చడమేనని అన్నారు. త్వరలో నియమించే మంత్రి పున: విస్తరణలో బీసీలకు సముచితం స్థానం కల్పించాలని నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవమండల నాయకులు జె ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో కృష్ణష్టమి

**ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదవ సంఘం సభ్యులు**

జ్యోతి ప్రభంజనం ప్రతినిధి అనంతపురంసోమందేపల్లి : శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవం గా జరుగుతున్నాయి, తమ ఇష్ట దైవం శ్రీ కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు యాదవ్ కులస్తులు, సోమందేపల్లి మండల పరిధిలోని నక్కలగుట్ట లో శు



క్రవారం వరణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు మహేష్ యాదవ్ సమక్షంలో శ్రీ కృష్ణుడికి వేద పండితులతో పూజలు చేయించారు, స్వామివారికి క్షీరాభిషేకం, నెయ్యి అభిషేకం, పసుపు కుంకుమ తో అభిషేకం చేసారు, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు, ఈ కార్యక్రమం లో గోపాల్ యాదవ్,మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ యాదవ్,రాజగోపాల్ యాదవ్,రవి యాదవ్, నాగరాజ్ యాదవ్, నరసింహామూర్తి యాదవ్, ఉపేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు....

# అమెరికాలోనూ వెల్లివిరిసిన కృష్ణభక్తి



బ్లూమింగ్టన్ (ఇలినాయిస్): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అమెరికాలోని చికాగో నవిూప బ్లూమింగ్టన్‌లో భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఘట్కేసర్‌కు చెందిన బెలిదే శ్రీకాంత్?నింధుజ దంపతులు తమ పిల్లలు నిశ్రుద్, క్రితిక, లకు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ నామస్మరణతో వారి ఇంట్లో పండుగ సందడి నెలకొంది. విదేశాల్లోనూ భారతీయ సంప్రదాయాలను కొనసాగిస్తూ పిల్లలకు సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయడం అభినందనీయమని పలువురు అన్నారు.

# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**- వేషధారణలతో చిన్నారుల సందడి**
**- మురిసిన పిల్లల తల్లిదండ్రులు**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడలో కృష్ణాష్టమి సందడి ఏర్పడింది. కృష్ణాష్టమి సందర్భంగా చిన్న పిల్లల సందడి అంతా ఇంత కాదు. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్న వాళ్లు తమ బిడ్డలను కన్నయ్యలా అలంకరించి మురిసిపోయారు. అంతేకాకుండా ఆలయాల్లో పలు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడక్కడ ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఉట్టి పందిళ్ల వద్ద సందడే సందడి వాతావరణ కనిపించింది.

# మహిళల హామీల అమలుకు బీఆర్ఎస్ పోరుబాట

**రూ. 2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్ పునరుద్ధరించాలి**
**కల్యాణలక్ష్మి, షాదీముబారక్ హామీలు అమలు చేయాలి**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 4:మహిళలకు ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమంలో భాగంగా కొత్తపేట డివిజన్‌లో మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఓమిని ఆస్పత్రి నుంచి జైన్ మందిర్ వరకు మహిళలు ర్యాలీగా తరలివచ్చి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఇది మహా పోరాటమని ఆయన పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో మహిళలకు ప్రకటించిన రూ. 2,500 ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పేద మహిళలు, గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడిన కేసీఆర్ కిట్ పథకాన్ని పునరుద్ధరించాలని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలకు సంబంధించిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సుధీర్‌రెడ్డి కోరారు. మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కులు, సంక్షేమం కోసం మహిళలే ముందుకు వచ్చి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ర్యాలీలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ మహిళా నాయకులు, పలు డివిజన్ల మహిళా అధ్యక్షురాళ్లు, ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కావాలంటే దీనికి ఇంకా పవర్‌ఫుల్ హెడ్డింగ్, 2?3 సబ్‌హెడ్డింగ్‌లతో నమస్తే తెలంగాణ శైలిలో కూడా తయారు చేయగలను.

# సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు



చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 04(జ్యోతి ప్రభంజనం): సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ మేడి శ్రీలతా శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంతో పాటు ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి గ్రామ శ్రేయస్సు, రైతుల సంక్షేమం, పంటల సమృద్ధి కోసం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలోని బుడ్డాయి వద్ద సంప్రదాయబద్ధంగా నీళ్లు పోసి పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి, పంటలకు సమృద్ధిగా సాగునీరు అందాలని, రైతులు సుఖసంతోషాలతో జీవించాలని గ్రామస్థులు సామూహికంగా వేడుకున్నారు. ప్రకృతి అనుకూలించి పంటలు సమృద్ధిగా పండితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేడి శ్రీలతా శ్రీను మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అన్నారు. రైతు సంతోషంగా ఉంటే గ్రామం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిట్యాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 04(జ్యోతి ప్రభంజనం) : చిట్యాల పట్టణంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ యువకులు పట్టణంలో ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించి,శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య నిర్వహించిన ర్యాలీతో పట్టణంలో పండుగ సందడి నెలకొంది. యాదవ కుల పెద్ద గొల్ల జడల ఆదిమల్లయ్య ఆధ్వర్యంలో ఉట్టిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. డప్పుచప్పుళ్లతో ఉట్టిని పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయం, శివాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం కోసం ఉట్టిని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్,వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు యాదవ యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. విజేతలను యాదవ కుల పెద్దలు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జడల చినమల్లయ్య, ఆగు సైదులు, మెండె సైదులు, ఏళ్ల భయ్యన్న, కడారి దేవి, ఏర్పుల స్వామి, బెల్లి సత్తయ్య, ఏర్పుల పరమేష్, సాగర్ల గోవర్ధన్, కోసనం అశోక్, ఆగు అశోక్, ఏళ్ల మల్లేష్, జడల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com